www.prajasakti.com

ప్రజాశక్తి

5

బుధవారం 15 అక్టోబర్ 2025

వైఎస్ఆర్



రేపు ఐటిఐ సర్కిల్‌లో నిరసన : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఈనెల 16న కర్నూల్ పర్యటనకు వస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వ రంగంలో కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించాలని, రాయలసీమకు 20వేల కోట్ల ప్యాకేజీ కేటాయించాలని డిమాండ్ చేస్తూ కడప నగరంలోని ఐటిఐ సర్కిల్ వద్ద సిపిఎం కడప నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నగర కార్యదర్శి రామ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రానికి గతంలో మూడుసార్లు వచ్చారని, ఇప్పుడు మళ్ళీ నాలుగోసారి వస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర అభివృద్ధి కోసం ఒక మాట కూడా మాట్లాడటం లేదని తెలిపారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి ప్రత్యక్షంగా 25 వేల మందికి, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పించేలా చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ హామీ అమలు చేయడానికి రాష్ట్రంలో ఉన్న కూటమి నేతలు ఏమాత్రం కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకువచ్చే ప్రయత్నం చేయలేదని తెలిపారు.

వర్షానికి ఉల్లి కుళ్లి..



వరుస వర్షాలకు కుళ్లిన ఉల్లి పంట

- రంగు మారిన ఉల్లి పంటను కొనుగోలు చేయని వ్యాపారులు
- వేల ఎకరాల్లో పంట నష్టం
- ఆందోళనలో రైతన్నలు
- ప్రభుత్వమే ఆదుకోవాలంటూ వేడుకోలు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఉల్లిపంట వేల ఎకరాలలో సాగైంది. ప్రస్తుతం పంట చేతికి అంది వచ్చే సమయంలో వరుస వర్షాలతో పంట పూర్తిగా దెబ్బతింది. నూర్పిడి చేసిన ఉల్లి పంట వర్షానికి తడుస్తూ ఉండడంతో పంట రంగు మారింది. మైదుకూరు నియోజకవర్గంలో దువ్వూరు, మైదుకూరు మండలాల్లో 5వేల ఎకరాలలో ఉల్లి పంటను రైతులు సాగు చేశారు. చాపాడు, బి.మఠం, ఖాజీపేట మండలాల్లో 200 ఎకరాల్లో ఉల్లి పంటను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం పంట పూర్తిగా నూర్పిడి దశకు చేరుకుంది . 100 కిలోల ఉల్లి ధర 500 కూడా పలకడం లేదు. ప్రస్తుతం వర్షాలకు రూ. ఉల్లి గడ్డలు అడిగే నాథుడు కరువయ్యారు. నూర్పిడి చేసి రంగు మారిన ఉల్లిని కొనుగోలు చేయాలని వ్యాపారులను రైతులు వేడుకుంటున్నా వారు పొలాల వైపు కూడా చూడడం లేదు. పంటను ఎక్కడ అమ్ముకోవాలో అర్థం కావడం లేదని దిగాలు చెందుతున్నారు. నూర్పిడి చేసిన ఉల్లిని నాలుగైదు రోజుల పాటు ఎండలో ఆరబెడితే దెబ్బతిన్న గడ్డలు తొలగిపోయిన మిగిలిన దిగుబడిన చేతికి వస్తుందనుకుంటే వరుసగా వర్షం పడుతుండడంతో ఆరబెట్టే అవకాశం లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. గత సోమవారం, శనివారం రాత్రి పడిన అధిక వర్షానికి ఉల్లి రైతులతో పాటు ఇతర పంట సాగు చేసిన రైతులూ కుదేలయ్యారు.దువ్వూరు మండలంలో నాగాయపల్లి, చల్లబసాయిపల్లి, బాలాయపల్లి, మదిరేపల్లి, గుడిపాడు, రామాపురం, మైదుకూరు మండలంలో శ్రీ నగరం, కేశలింగాయపల్లి, బండి వారి పల్లి, చిన్నయ్య గారి పల్లి, వనిపెంట , ద్వారకానగరం, జడ్జి గారి కోటాలు గ్రామాల పరిధిలో ఉల్లిపంటను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం కొనుగోలుకు వ్యాపారులు ఆసక్తి చూపకపోవడంతో ఉల్లి దిగుబడిని అలానే వదిలేస్తున్నారు. కొంత మంది నూర్పిడి చేసిన గడ్డలను పంట పొలాల నుంచి తరలించి కాలువలు ఖాళీ ప్రదేశాల్లో పడేస్తున్నారు. చాలామంది ప్రజలకు ఉచితంగా ఉల్లిగడ్డలను తీసుకువెళ్లాలని సూచిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి ఉల్లి రైతును ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



తడిసిన ఉల్లిని చూపుతున్న మహిళా రైతు (ఫైల్)

2 ఎకరాలలో ఉల్లి పంట సాగు

ఖరీఫ్ సీజన్‌లో 2 ఎకరాలలో ఉల్లి పంటను సాగు చేపట్టాను. ఎకరా రూ.20వేలకు కౌలుకు తీసుకున్నారు. ప్రస్తుతం నూర్పిడి చేసే సమయానికి వర్షం అధికంగా పడుతుంది. దీనితో పంట దెబ్బతిని రంగు మారుతుంది. వ్యాపారులు కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. చేతికి అంది వచ్చిన పంట ధరలు లేక పోవడంతో దిక్కుతోచడం లేదు. ఎకరా ఉల్లిపంట సాగుకు రూ.80 వేలకు పైగా ఖర్చులు అయ్యాయి.

-ప్రసాద్, ఉల్లి రైతు, సిద్ధారెడ్డిపల్లె.

ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనుగోలు చేయాలి

ప్రస్తుతం నూర్పిడి చేసిన ఉల్లి పంటను స్థానికంగా వ్యాపారులు ఎవరూ కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు సాగు చేసిన ఉల్లి పంటను గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలి. ఉల్లి పంట సాగుకు రూ. 75వేలకు పైగా ఖర్చులు అయ్యాయి. ప్రస్తుతం వర్షానికి తడుస్తూ పంట పూర్తిగా దెబ్బతింటున్నది.

-వెంకటసుబ్బారెడ్డి, ఉల్లి రైతు, చల్లబసాయిపల్లి, దువ్వూరు.

కలివికోడి అన్వేషణ ముమ్మరం





ఇటీవలి కూత రికార్డింగ్‌తో పెరిగిన ఆశలు

లంకమల అభయారణ్యంలో ఐదు ప్రాంతాలు గుర్తింపు

శబ్దం, ఉనికి గుర్తింపుపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



ఎట్టకేలకు కలివికోడి ప్రాజెక్టులో కదలిక వచ్చింది. నెల రోజుల కిందట కలివికోడి కూతలు సౌండ్ సిస్టమ్స్‌లో రికార్డు అయినట్లు తేలింది. అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖ కలివి కోడి ప్రాజెక్టు పరిశోధన ముమ్మరం చేసింది. జిల్లాలోని సిద్ధవటం మండల పరిధిలోని లంకమల అభయారణ్యంలో ఐదు ప్రాంతాలను గుర్తించింది. ఫలితంగా ప్రాజెక్టు పరిశోధకులు అత్యాధునిక కెమెరాలు, రికార్డు సౌండ్ సిస్టమ్స్ ఏర్పాటు వ్యవస్థలను ఏర్పాటు చేసింది. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి కలివికోడి పరిశోధనా కార్యకలాపాలను ముమ్మరం చేసింది. ప్రపంచంలోనే అంతరించిపోతున్న అరుదైన పక్షి జాతుల్లో కలివికోడి (జోర్డాన్‌కర్సర్) ఒకటి. 1900లో మహారాష్ట్ర, తెలంగాణలోని అదిలాబాద్ జిల్లా ప్రాంతాల్లో కనిపించింది. అనంతరం 1986లో కడప జిల్లాలోని సిద్ధవటం-అట్లూరు మండల ప్రాంతాల్లో కనిపించింది. జిల్లాలో కలివికోడి ప్రాజెక్టు కింద రూ.50 లక్షల నుంచి రూ.50 కోట్లతో పరిశోధనను ముమ్మరం చేశారు. ప్రపంచంలోనే అంతరించిపోతున్న అరుదైన పక్షిజాతి పరిశోధన ప్రాజెక్టును కొన్నేళ్లపాటు 14 నుంచి 16 అత్యాధునిక కెమెరాల సహాయంతో సౌండ్, రికార్డింగ్, పక్షి ఫొటో రికార్డర్లతో పరిశోధించారు. జిల్లా అటవీశాఖతోపాటు ఎస్‌సిఎఫ్, మరో రెండు ఎన్‌జిఒ సంస్థలు సంయుక్తంగా అన్వేషణలో పాలుపంచుకున్నాయి. ఏళ్ల తరబడి కలివికోడి కనిపించని నేపథ్యంలో మూడేళ్ల కింద మూసివేసిన సంగతి తెలిసిందే. ముంబయ్‌కు చెందిన బాంబే నేచరల్ ఆఫ్ హిస్టరీ సెంటర్ (బిహెచ్ఎన్ఎస్) కన్సర్వేషన్‌కు చెందిన అధికారి మెరైన్ బయాలజీ వైపు మొగ్గు చూపడమే ప్రధాన కారణమనే వాదన వినిపించింది. అంతకు ముందు డైరెక్టర్‌గా పనిచేసిన జగన్నాథం రాష్ట్రంలో (బర్డ్ స్పీసెస్) బట్టమేక పక్షిమీద ప్రయోగాలు చేసిన అనుభవం ఉంది. అనంతరం బాధ్యతలు చేపట్టిన బిహెచ్ఎన్ ఎస్ఎస్ డైరెక్టర్ ఆసక్తి చూపకపోవడంతో స్తబ్దత నెలకొంది. మూడేళ్ల కిందట నుంచి కలివికోడి ప్రాజెక్టు పరిశోధనా ప్రక్రియ మూలన పడింది. నెల రోజుల కిందట కలివికోడి కదలికలు, సౌండ్ సిస్టమ్స్‌లో రికార్డు కావడం, పక్షి ప్రేమికులు కలివికోడి కూత తాము విన్నట్లు ఇంటర్నెట్‌లో పెట్టిన నేపథ్యంలో కలివికోడి అన్వేషణ ప్రక్రియను మరోసారి పునరుద్ధరించడం గమనార్హం.

కలివికోడి రికార్డింగ్ వార్తలు వాస్తవమే

కలివికోడి శబ్దాన్ని రికార్డింగ్ చేసినట్లు వార్తలు వచ్చిన మాట వాస్తవమే. లంకమల అభయారణ్యంలో కలివికోడి కూతను పోలిన పక్షుల కూతలను సైతం పోల్చుకుని వాస్తవానికి రావాల్సి ఉంది. కలివికోడి ప్రాజెక్టు పరిశోధనను వేగవంతం చేశాం.

- వినీత్‌కుమార్, డిఎఫ్ఒ, కడప.



మహిళ కుమారులు, కుమార్తెతో మాట్లాడుతున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

ఒంటరి మహిళకు న్యాయం

ప్రజాశక్తి - కడప

వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల బాధ్యత వారి బిడ్డలదేనని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. అందరూ ఒంటి ఒంటరి జీవనం సాగిస్తున్న బుసల లక్షుమ్మ అనే మహిళకు జడ్జి న్యాయం చేశారు. ఆమెను పిల్లల వద్దకు చేర్చి పోషణ బాధ్యత వారికి అప్పగించారు. కడప నగరంలో తారకరామానగర్‌లో ఎలాంటి ఆదరణ లేకుండా ఒంటరిగా నివస్తున్నారు. విషయం తెలుసుకున్న జడ్జి వెనువెంటనే స్పందించి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులను పంపారు. వారు ఆమెను మంగళవారం జడ్జి వద్దకు తీసుకెళ్లారు. ఆమెకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వారిలో ఒక కుమారుడు కలకడలో నివాసముంటున్నాడు. మిగిలిన ముగ్గురు కుమారులను, కుమార్తెను జడ్జి పిలిపించి ముగ్గురు కుమారులు నెలకు ఒక్కొక్కరు రూ.1500 చొప్పున ఇవ్వాలని, కుమార్తె వద్ద తల్లి లక్షుమ్మ నివాసం ఉండేలా ఆదేశించారు. ఈ విధంగా వారు జడ్జి ఎదుట ఒప్పుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు, మనోహర్, రవితేజ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - కడప

పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ప్రోగ్రాం ఆఫీసర్ ఏ. విజయ్ కుమార్ సూచించారు. నాగార్జున మహిళాడిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మంగళవారం యూనిట్-1 కు చెందిన 47 మంది వలంటీర్లు ఫకీర్‌పల్లెలో ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. ప్రోగ్రాం ఆఫీసర్ ఏ. విజయ్ కుమార్ ఫకీర్ పల్లె గ్రామంలో స్వచ్ఛభారత్ నిర్వహించి, ఆరోగ్య జాగ్రత్తల గురించి వివరించారు. అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. మొదట నాగార్జున డిగ్రీ కాలేజ్ విద్యార్థులు ర్యాలీగా ఫకీర్ పల్లకి వెళ్లి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

విద్యార్థినులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

ప్రభుత్వం స్టార్టప్ ఇండియా, మేకిన్ ఇండియా, బేటి బచావో, బేటీ పడావో వంటి పథకాల ద్వారా యువతులను ప్రోత్సహిస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర జి.రవీంద్రనాథ్ అన్నారు. మంగళవారం ఆర్ట్స్ కళాశాలలో ఎల్ఐసి శ్రామిక మహిళా విభాగం, మహిళా సాధికార విభాగం నిర్వహించిన వక్తృత్వ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతులు చదువు, నైపుణ్యాలు, ఆరోగ్యంపై దృష్టి పెట్టి, శ్రమతో ఉన్నత స్థానాలు సాధించాలని సూచించారు. డాక్టర్ సులోచన, డాక్టర్ వై.సావిత్రి మాట్లాడుతూ ఒక మహిళ ఎదిగితే ఒక తరం ఎదుగుతుందని అన్నారు. ఎల్ఐసి యూనియన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, మహిళా కన్వీనర్ వసుప్రద మాట్లాడుతూ ఎఐఐఇఎ ప్లాటినం జూబ్లీలో భాగంగా విజేతలకు ఈ నెల 18న కడపలో జరిగే శ్రామిక మహిళా సదస్సులో బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. 'చదువుకున్న యువతుల ముందున్న అవకాశాలు సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీలో సయ్యద్ తహసీన్, ఖుషి మహమ్మద్, సాలిక మొదటి మూడు స్థానాలు సాధించగా, సమీనా, మహేశ్వరీ, భాగ్యలక్ష్మి కన్సోలేషన్ బహుమతులు పొందారు. అధ్యాపకులు కల్పన, అనిత, షాహిన్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : డిఎస్‌సి తర్వాత మిగిలిన ఖాళీ పోస్టులకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించి, ఈసంవత్సరం జూన్‌లో బదిలీ పొందిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. కడపలో ఆర్జెయూపీ టీచర్స్ భవన్‌లో మంగళవారం జిల్లా నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులలో చాలా మంది కొత్త స్థానాల్లో చేరినప్పటికీ, కొంతమంది మాత్రం రిలీవర్ వచ్చే వరకు విడుదల కాకుండా పాత పాఠశాలలోనే కొనసాగారని తెలిపారు. వీరి జీతం బదిలీ పొందిన కొత్త పాఠశాలల్లో పొందాలని ఉత్తర్వులిచ్చారని చెప్పారు. వీరందరూ కొత్త డిఎస్‌సి ఉపాధ్యాయులు రాగానే రిలీవ్ చేస్తారని ఆశతో ఉన్నారని చెప్పారు. డిఎస్‌సిలో అన్ని ఖాళీలు భర్తీ కాకపోవడంతో బదిలీ పొందిన వీరు రిలీవ్‌కాని పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు.

నాణ్యతతో ఇంధన సేవలు : కలెక్టర్

- ఎమ్మెల్యేతో కలిసి రెవెన్యూ సంక్షేమ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం



రెవెన్యూ సంక్షేమ ఫిల్లింగ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

క్వాలిటీ, క్వాంటిటీలో ఎక్కడా రాజీ లేకుండా ప్రజలకు పారదర్శకంగా మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో రెవెన్యూ శాఖ నిర్వహణలో పెట్రోల్ స్టేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం ప్రొద్దుటూరు పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయ సమీపంలో ప్రధాన రహదారిలో నూతనంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ సంక్షేమ ఫిల్లింగ్ స్టేషన్‌ను ఆయన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులు రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంధన సేవా రంగంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో రెవెన్యూ సంక్షేమ ఫిల్లింగ్ స్టేషన్ ను భారత్ పెట్రోలియం సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారన్నారు. రాయలసీమలో ఇది మూడవ రెవెన్యూ పెట్రోల్ బంక్ అని, జిల్లాలోనూ మూడు పెట్రోల్ బంక్‌లు నిర్వహణలో ఉన్నాయని పేర్కొన్నారు. భవిషత్తులో ప్రొద్దుటూరు పట్టణంలో సిఎన్‌జి ఫిల్లింగ్ స్టేషన్ కూడా స్థాపించడానికి చర్యలు చేపడుతామన్నారు. ఆర్థికంగా అత్యంత వేగవంతంగా జిఎస్‌టి ఆదాయంలో ప్రొద్దుటూరు పట్టణంలో 20 శాతం భాగస్వామ్యాన్ని కలిగివుందన్నారు. ప్రొద్దుటూరు పట్టణంలో వినియోగదారులు అధికంగా ఉన్నారని,ెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నడిచే ఈ ఫిల్లింగ్ స్టేషన్‌కు మంచి ఆదరణ లభిస్తుందన్నారు. భవిష్యత్తులో పొగలేని సిఎన్‌జి ఇంధనాన్ని ప్రాచుర్యంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడతామన్నారు. రైతులు పండించే పంట ఉత్పత్తుల ద్వారా ఉత్పత్తయ్యే ఇథనాల్‌ను కాలుష్య రహిత ఇందనంగా వినియోగదారులకు అందిస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థల నిర్వహణలో సేవలందించే పెట్రోల్ బ్యాంకుల్లో స్వచ్ఛమైన, నాణ్యమైన, కొలత పరంగా కూడా కచ్చితమైన పరిమాణంలో సరఫరా చేస్తారన్నారు. రెవెన్యూ పెట్రోల్ బంక్ సర్వీసు లాభదాయకంగా జరిగేలా ప్రొద్దుటూరు ప్రజలు సహకరించాలని కోరారు.అనంతరం ఫిల్లింగ్ స్టేషన్ ఆవరణలో హరిత ప్రొద్దుటూరులో భాగంగా కలెక్టర్ మొక్కలను నాటారు. కార్యక్రమంలో కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రా రెడ్డి, భారత్ పెట్రోలియం లిమిటెడ్ టెరిటరీ మేనేజర్ నెల్లూరు వేణుగోపాల్, తహశీల్దార్ గంగయ్య, రెవెన్యూ అధికారులు, భారత్ పెట్రోలియం సంస్థ ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నూతన విసికి ఘన సన్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్



విసిని సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

యోగి వేమన యూనివర్సిటీ నూతన విసి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్‌ను ప్రయివేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విసి చాంబర్‌లో విసిని శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ అకడమిక్ పరంగా మీకు యూనివర్సిటీ నుంచి పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ డిగ్రీ సబ్జెక్టులలో సింగల్ మేజర్ విధానం తీసివేయాలని కోరారు. ఎంసెట్ క్వాలిఫైయింగ్ మార్కులు తగ్గించమని యాజమాన్యం తరపున ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై విసి సానుకూలముగా స్పందిఇంచారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకట రమణ, సెక్రటరీ శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, మేధా నరసింహులు, జయప్రకాష్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, సంజీవరెడ్డి, రాఘవరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్, శ్రీనివాసులు రెడ్డి, చంద్ర, నారాయణ వర్మ, నాగేశ్వర్ రెడ్డి, మాధవ రెడ్డి, రవీంద్ర, రవిశేఖర్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, చలమారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

ఎల్ఎల్‌బి పరీక్షలు తనిఖీ

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న లా సెమిస్టర్ పరీక్షలను నూతన విసి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ మంగళవారం తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్ల గురించి చీఫ్ సూపరింటెండెంట్ ఆచార్య జి.కాత్యాయని వివరించారు. ప్రస్తుత పరీక్షకు 503 మంది హాజరయ్యారని, 67మంది విద్యార్థులు గైర్హజరయ్యారని తెలిపారు. అతిపెద్ద పరీక్షల హాల్‌ను విసి పరిశీలించారు. ఆయన వెంట కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు ఉన్నారు. పరీక్షల విధుల్లో పరీక్షల అబ్జర్వర్ డాక్టర్ గణేష్ నాయక్, సహాయ పరీక్షల అధికారులు టి. లక్ష్మీప్రసాద్, మునికుమారి, సిబ్బంది పి.చంద్రమౌళి పాల్గొన్నారు.

రేపు మినీ జాబ్‌మేళా

ప్రజాశక్తి - కడప అర్బన్ నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల, నోడల్ కళాశాల, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 16న మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డా.జి.రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాలో హెటెరో లాబ్స్ లిమిటెడ్, యాక్సిస్ బ్యాంక్, నెక్స్ టెల్ మెటా ప్రయివేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, బి.టెక్, మాస్టర్ డిగ్రీ, డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. జాబ్ మేళాలో పాల్గొనదలచిన అభ్యర్థులు 4 సెట్స్ బయోడేటా/రెస్యూమ్/ఆధార్/పాన్ కార్డుతోపాటు సర్టిఫికేట్‌ల జిరాక్సు ప్రతులతో హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు 9347256400, 9390052901లో సంప్రదించాలని తెలిపారు.

రెండవ రోజూ రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-కాశినాయన :రెండవ రోజు రిలే నిహార దీక్షలు జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి పల్లా వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ జిల్లా కమిటీ సభ్యులు ఎంబడి పోలయ్య ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో భూ కబ్జాలు విపరీతంగా జరుగుతుంటే రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం చాలా బాధాకరమన్నారు. నాయనపల్లె రెవెన్యూ పొలంలో దాదాపు 800 ఎకరాలు కబ్జా అవుతుంటే రెవెన్యూ అధికారులు విధులు నిర్వహిస్తున్నారా లేదా కాలయాపన చేస్తున్నారా అనే అనుమానం కల్గుతోందన్నారు. భూ కబ్జాదారులపైనా, రాజకీయ నాయకులపైనా రెవెన్యూ అధికారులకువున్న ప్రేమ పేదలపై లేకపోవడం దారుణమని వాపోయారు. రెండవ రోజు రిలే నిరాహార దీక్షలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు వరికుంట్ల బాబు, రాజశేఖర్, బాల్ జోజి, సత్యరాజు, అభిషేక్, అజయ్, మరియమ్మ, స్మైలీ, సారమ్మ, విజయమ్మ పాల్గొన్నారు.

వేధింపులు క్షమించరాని నేరం

ప్రజాశక్తి- వల్లూరు : ఫోక్స్ చట్టంపై విద్యార్థులకు అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని, పిల్లలపై వేధింపులు క్షమించరాని నేరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారిభారతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో అంతర్జాతీయ బాలికల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా లింగ వివక్షత, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నివారణ చట్టంపై బచావో, బేటి పడావో, ఫోక్స్ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2012 నుండి ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ బాలికల దినోత్సవం ప్రతి సంవత్సరమూ నిర్వహించుకోవాలని నిర్ణయించారన్నారు. సమాజంలో బాలికలు సమానత్వం విద్యా, ఉద్యోగం, లింగ వివక్షత మొదలగు అంశాలలో హక్కులను సాధించుకునేందుకు బాలికలకు అవగాహన కల్పించుటలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ వెంగల్ రెడ్డి, జయప్రకాష్, లీగల్ అధికారి పాళేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపల్ సురేష్ బాబు, సూపర్వైజర్ మమత, సుధాకర్, రమాదేవి పాల్గొన్నారు.

సిపిఆర్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కలసపాడు : సిపిఆర్‌పై ప్రజలకు సిపిఆర్‌పై అవగాహన అవసరమని ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ శైలజ పేర్కొన్నారు. మంగళశారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిపిఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక వ్యక్తి గుండె కొట్టుకోవడం లేదా శ్వాస ఆగిపోవడం జరిగినప్పుడు అతని ప్రాణాలను రక్షించడానికి చేసే అత్యవసర పద్ధతిని సిపిఆర్ అంటారని, దీనిపై ప్రజలకు తెలుసుకోవాలని సూచించారు. ఆగిపోయిన గుండె పనితీరును తిరిగి మొదలుపెట్టడం, ఆక్సిజన్ కలిగిన రక్తాన్ని మెదడు, ప్రాణాధర అవయవాలకు పంపవచ్చన్నారు. బాధితుడిని గట్టిగా ఉన్న నేలపై పడుకోబెట్టి, కుడి చేతితో ఒకదానిపై మరొకటి చెయ్యి పెట్టి చాతి మధ్యభాగంపై ఉంచాలని, నిమిషానికి కనీసం 100-120 సార్లు గట్టిగా నొక్కాలన్నారు. ప్రతి నొక్కుడు 5-6 సెంటీమీటర్ల లోతు వరకు ఉండాలని సూచించారు. ఇలా చేయడం వల్ల గుండె ఆగిపోయిన బాధితులను చాలావరకు రక్షించినవారమవుతామని చెప్పారు.



నిరసన తెలియజేస్తున్న జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ కమిటీ నాయకులు

న్యాయమైన డిమాండ్లను తీర్చాలి

- జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ కార్యదర్శి సి.శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి - కడప

తమ న్యాయమైన డిమాండ్లను తక్షణం తీర్చాలని జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ కార్యదర్శి సి.శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. దేశవ్యాప్త నిరసన ప్రదర్శన సందర్భంగా ఆల్ ఇండియా ప్రయివేట్ సెక్టార్ బ్యాంక్ యూనియన్ల సెల్ పిలుపులో భాగంగా మంగళవారం సాయంత్రం కడప నగరం అప్సర సర్కిల్ వద్ద గల కరూర్ వైశ్య బ్యాంక్ ఎదుట కడప జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేట్ బ్యాంకుల జాతీయకరణ చేయాలన్నారు. ప్రయివేట్ బ్యాంకుల పెన్షన్ నిధిపై సిబిడిటీ మినహాయింపు ఇవ్వాలని పేర్కొన్నారు. కాస్ట్ టు కంపెనీ ఉద్యోగుల ందరిని క్రమబద్ధీకరించాలని చెప్పారు. తమిళనాడు మర్కంటైల్ బ్యాంకు ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయస్సు 60 సంవత్సరాలకు పెంచాలన్నారు. నైనిటాల్ బ్యాంక్ అమ్మకం ఆపాలని, బ్యాంక్ ఆఫ్ బరోడాలో విలీనం చేయాలన్నారు. ప్రయివేట్ బ్యాంకు పెన్షనర్లకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. సిఎస్‌బి బ్యాంకులో సత్వర వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఫెడరల్ బ్యాంకులో విక్టిమైజేషన్‌లు రద్దు, క్లరికల్ అండ్ సబ్ స్టాఫ్ ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ అధ్యక్షులు దస్తగిరి, ఆర్గనైజింగ్ కార్యదర్శి అనిల్, ఉపాధ్యక్షులు అజీజ్, సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


విద్యుత్ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కార్మికులు ఈనెల 15 నుంచి తలపెట్టిన సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, మనోహర్, జిల్లా కోశాధికారి లక్ష్మీదేవి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలం అవుతుందని పేర్కొన్నారు. ప్రజల పైన అనేక రూపాల్లో సర్ ఛార్జీలు, పెనాల్టీలు, మిగులు తదితర రకరకాల పేర్లతో విద్యుత్ ఛార్జీలు పెంచారని తెలిపారు. అందులో పని చేస్తున్న ఉద్యోగులకు మాత్రం వేతనాలు పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం సరిగా స్పందించడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం స్పందించి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలిపారు.

సంతకాల సేకరణకు విశేష స్పందన

ప్రజాశక్తి - కడప అర్బన్

'ఓట్ చోర్ గద్దె చోడ్' కార్యక్రమంలో భాగంగా 33, 46వ డివిజన్ ఇన్‌ఛార్జి షేక్.కరిముల్లా, సయ్యద్ ముబారక్ బాషా చివరి రోజు నిర్వహించిన సంతకాల సేకరణకు విశేష స్పందన లభించిందని ఆ పార్టీ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్‌పీర్ తెలిపారు. మంగళవారం చేపట్టిన సంతకాల సేకరణకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ఉత్సాహవంతంగా ముందుకు వచ్చారని చెప్పారు. రాహుల్ గాంధీ ప్రారంభించిన ఈ కార్యక్రమం రాజ్యాంగబద్ధంగా కొనసాగిందని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని మన ఓటు హక్కును మనం సద్వినియోగించుకోలేకపోవడం బాధాకరమని తెలిపారు. ఈ విషయంపై ఎలక్షన్ కమిషన్ కూడా స్పందించకపోవడంతో ఈ ఉద్యమం మొదలు పెట్టారని చెప్పారు. ఈ ఉద్యమాన్ని పిసిసి అధ్యక్షులు షర్మిల నాయకత్వంలో డిసిసి అధ్యక్షులు విజయ జ్యోతి ఆధ్వర్యంలో సుమారు నెలరోజులుగా విజయవంతంగా కొనసాగిందని పేర్కొన్నారు. కడప నగరంలో దాదాపు 50 డివిజన్లలలో ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి సంతకాలు చేస్తున్నారని తెలిపారు. ఫలితంగా ప్రజలకు ఓటు చోరి గురించి అవగాహన వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో దాసరి శ్రీనివాసులు, షేక్.షామీర్ హుస్సేన్, సిద్ధిక్, సద్దాం, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న గౌస్‌పీర్



ఎంపీకి వినతిపత్రం అందిస్తున్న ఆర్‌సిడిఎస్ ప్రతినిధులు

వ్యవసాయానికి 'ఉపాధి'ని అనుసంధానం చేయాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వ్యవసాయ పనులను ఉపాధి హామీ చట్టాన్ని అనుసంధానం చేయాలని రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ (ఆర్‌సిడిఎస్) రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, ప్రతినిధులు మంగళవారం రైతుల తరపున కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల్లేక రైతులు కూలీలకు వేతనాలు చెల్లించడంలో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి హామీని వ్యవసాయ పనులకు నేరుగా అనుసంధానం చేయాలన్నారు. తద్వారా రైతులకు కూలీల పెట్టుబడి భారం గణనీయంగా తగ్గుతుందన్నారు. రైతులకు ఆర్థికంగా కొంత ఊరట కలుగుతుందన్నారు. రైతులకు మాత్రమే కాకుండా గ్రామీణ కూలీలకు కూడా మేలు చేస్తుందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరిగి వారి ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌సిడిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సర్వోత్తమ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రఘురామిరెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎద్దుల అర్జున్‌రెడ్డి, వైసిపి వేముల మండల అధ్యక్షులు నాగేళ్ల సాంబశివరెడ్డి పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన ఎంపీ

పులివెందుల రూరల్ : సోకే వంశీ, తలుపుల శశికళ నూతన వధూవరులను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కోడి రమణ మంగళవారం వారి ఇంటికెళ్లి ఆశీర్వదించారు. కౌన్సిలర్ సోకే వెంకటరమణ, సతీమణి రాధ కుమారుడి వివాహం ఇటీవల కదిరి రోడ్డులోని విజయ గార్డెన్స్‌లో జరిగింది. వైసిపి నాయకులు పాల్గొన్నారు.



భక్త చింతామణి నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు(ఇన్‌సెట్) ముద్రా అమర్నాథ్‌రెడ్డి

నాటి కళలు.. నేటి తరానికి తెలపాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

నాటి కళలను నేటి యువతకు తెలపాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కాంట్రాక్టర్ ముద్రా అమర్నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పి. బొమ్మేపల్లి గ్రామంలో సోమవారం రాత్రి కాంట్రాక్టర్ అమర్నాథ్‌రెడ్డి తండ్రి ఎం.వెంకటరమణారెడ్డి (డిష్ భీమారెడ్డి) మూడవ వర్ధంతి సందర్భంగా భక్త చింతామణి నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి గ్రామంలో డిష్ భీమారెడ్డిగా పిలుస్తారన్నారు. ఆయన ఆదర్శాలు, స్ఫూర్తితోనే తాను ప్రతి ఏటా ఆయన వర్ధంతిని వివిధ స్వచ్ఛంద సంస్థలకు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. తమ తండ్రి జ్ఞాపకార్థం గ్రామంలో భక్త చింతామణి నాటకాన్ని అద్దంకి శ్రీనివాసరావు బృందంచే వేయించామన్నారు. సినిమాలు, సీరియల్స్ రావడంతో నాటకాలు వేసే కళాకారులు వారి వృత్తిని కోల్పోవాల్సి వస్తోందన్నారు. నాటి కళలను, భావాలను వ్యక్తం చేసే నాటకాలను ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంలో అందరికీ ఉందన్నారు. మరుగున పడిన కళలకు జీవం పోయడమే తన ప్రధాన ఉద్దేశమన్నారు. గతంలో శ్రీకృష్ణతులాభారం, రామాంజనేయ యుద్ధం, సత్య హరిశ్చంద్ర, శ్రీకృష్ణ రాయబారం, చెంచులక్ష్మి, చిన్నమ్మ కథ వంటి నాటకాలను ప్రదర్శించేవారన్నారు. నేడు ఇవి అంతరించి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇలాంటి కళాకారులను గుర్తించి తగు గౌరవాన్ని ఇవ్వాలని అమర్నాథ్‌రెడ్డి కోరారు.

దురుసు ప్రవర్తనపై ఆర్‌టిసి డిఎంకు కౌన్సిలర్ ఫిర్యాదు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఇటీవల కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పథకం పేరుతో మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించింది. ఈ క్రమంలో డ్రైవర్లు, కండక్టర్లు ఉచిత ప్రయాణమనే నెపంతో మహిళల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని ప్రొద్దుటూరు డిపో మేనేజర్‌కు ఎర్రగుంట్ల 17వ వార్డు కౌన్సిలర్ ఎరికలరెడ్డి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎరికలరెడ్డి మాట్లాడుతూ ప్రయాణికులు కోరినచోట బస్సును ఆపడం లేదన్నారు. ప్రయాణికులకు అవసరమైన చోట బస్సు ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మీరేమైనా డబ్బులు చెల్లిస్తున్నారా అని మహిళలను కండక్టర్లు చులకనగా మాట్లాడుతున్నారన్నారు. డ్రైవర్లకు, కండక్టర్లను సమా వేశపరిచి ప్రయాణికులను గౌరవించేలా సూచించాలని కోరారు. ఇందుకు డిపో మేనేజర్ స్పందిస్తూ అలా చులకనగా మాట్లాడిన వారిని ఇటీవల కాలంలో సస్పెండ్ చేశామన్నారు. ఉద్యోగులు ప్రయాణికుల పట్ల దురుసుగా ప్రవర్తిం చినట్లు ఫిర్యాదులు వస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎం తెలిపారు.

రాయలసీమ సమస్యలపై ప్రధానమంత్రి స్పందించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమకు తీరని ద్రోహం చేశారని, వారికి రాయలసీమలో బహిరంగ సభ ఏర్పాటు చేసే నైతిక హక్కు లేదని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు బహిరంగ సభలోనైనా రాయలసీమ సమస్యలపై ప్రధాని, సిఎం స్పందించాలని కోరారు. 1937 నాటి శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాజధాని, హైకోర్టులో ఒకదానిని సీమలో ఏర్పాటు చేయాలని కోరారు. మోడీ, చంద్రబాబు పాలనలో ఆ రెండింటిలో ఒకటి కూడా సీమలో ఏర్పాటు చేయలేదన్నారు. రాష్ట్రానికి శాశ్వత అన్యాయం చేశారని తులసిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంతోపాటు రాయలసీమకు ప్రత్యేకహోదా సంజీవని లాంటిదన్నారు. కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని రాయలసీమలో కాకుండా విజయవాడలో ఏర్పాటు చేయాలని చంద్రబాబు ప్రభుత్వం లేఖ రాయడం శోచనీయమన్నారు. రాయలసీమ పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే 16న బహిరంగ సభలో విభజన చట్టాల హామీలపై ప్రధానమంత్రి మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టత వ్వాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

మొక్కల పెంపకం కీలకం

చాపాడు : పర్యావరణ పరిరక్షణలో మొక్కల పెంపకం కీలకమని మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి. నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రత్యేక శిబిరంలో మంగళవారం ఇందిరమ్మ కాలనీ పలు ప్రదేశాల్లో మొక్కల నాటారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటడం ద్వారా సమాజానికి ఆక్సిజన్ అందించగలరన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.వి. కృష్ణారెడ్డి, పాఠశాల హెడ్‌మాస్టర్ గురివిరెడ్డి, ఉపాధ్యాయులు రమణారెడ్డి, వెంకటసుబ్బయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని చిన్నారికి గాయాలు

వేంపల్లె : స్థానిక గండి రోడ్డులో నడుచుకుంటూ వెళుతున్న ముక్తల్ అనే చిన్నారిని మంగళవారం మోటర్ బైక్ ఢీకొంది. సారా కలెక్షన్స్ దుకాణ యాజమాని కుమారుడు ముక్తల్ పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా బైకు ఢీకొంది. ముక్తల్ కాలికి గాయం కావడంతో ప్రయివేటు హాస్పిటల్‌కు తరలించి ప్రథమ చికిత్స చేయించారు.

కారు ఢీకొని అంగన్వాడీ కార్యకర్తకూ..

ముద్దనూరు : కడప-తాడిపత్రి ప్రధాన రహదారి కొత్తపల్లి గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్న ప్రమీల మంగళవారం ఉదయం రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తూ కారు ఢీకొని తీవ్రంగా గాయపడింది. ప్రమీలను స్థానికులు 108లో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

రైతుల సమక్షంలోనే రీసర్వే చేయాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

భూముల రీ సర్వే (భూ కొలతలు) ఆయా గ్రామాల రైతుల సమక్షంలోనే చేయాలని చేస్తున్న గ్రామాల్లో రైతుల సమక్షంలోనే పక్కాగా చేయాలని మంగళగిరి సెంట్రల్ సర్వే ఆఫీస్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి సూచించారు. మండలంలోని వేల్పుచెర్ల, రాఘవాపురం గ్రామాల్లో మంగళవారం రీ సర్వే ప్రాజెక్టు ఫేస్-3లో భాగంగా శ్రీని వాసులరెడ్డి భూమి గట్ల నిజనిర్ధారణ పరిశీలించారు. అనంతరం కొత్తపల్లి గ్రామ సచివాలయంలో జమ్మలమడుగు డివిజన్ మండల సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో భాగంగా ప్రాజెక్టు ఫేజ్-3 కింద రీ సర్వే చేస్తున్న గ్రామాల్లో కొల తలు పక్కాగా చేయాలని సూచించారు. రీ సర్వే చేసే రెండు రోజుల ముందు రైతులకు నోటీసులు జారీ చేయాలన్నారు. రీ సర్వే చేసిన తర్వాత భూ సరిహద్దులు, విస్తీర్ణం తెలుపుతూ రైతులకు నోటీసులు ఇవ్వాలన్నారు. పాసు పుస్తకాల్లో విస్తీర్ణం భూమి మీద ఉన్న అనుభవానికి కొలతల్లో వ్యత్యాసం ఉంటే రైతులు అప్పీలు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కడప అసిస్టెంట్ డైరెక్టర్ కె.మురళీకృష్ణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎ.పుల్లయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.హరి, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి

చెకుముకి పరీక్షలు విద్యార్థుల్లో మేధోశక్తిని పెంచుతుంది



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

చెకుముకి పరీక్షలు విద్యార్థుల్లో మేధోశక్తిని, శాస్త్రీయ ఆలోచనలను పెంచుతుందని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో చదువుతున్న 8, 9, 10 తరగతుల విద్యార్థుల కోసం చెకుముకి పేరుతో శాస్త్రీయ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పట్ట ణంలోని అహోబిల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పోస్టర్ ఆవి ష్కరించారు. అనంతరం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఈ నెల 18న పాఠశాల స్థాయిలో జరిగే ఈ పరీక్షలలో అందరూ తప్పకుండా పాల్గొనాలని విద్యార్థుకు సూచించారు. పాఠశాల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని మండల స్థాయికి ఎంపిక చేసి పంపే బాధ్యతను పాఠశాల యాజ మాన్యం చూస్తుందన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు శాస్త్రీయ అవగాహనను కల్పించడంలో, సైంటిఫిక్ పరిశోధనలను నేర్పించడంలో ముందంజలో ఉందని పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జన విజ్ఞాన వేదిక సభ్యులు కోరారు. జెవివి నాయకులు సనావుల్లా, శివరాం, బాలజంకులు, గఫూర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు : జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతం చేయాలని క్యాంబెల్ హాస్పిటల్ సూపరింటెండ్ అగస్టిన్ రాజ్ కోరారు. క్యాంబెల్ హాస్పిటల్‌లో జిల్లా కార్యదర్శి గుర్రం డేవిడ్, అగస్టిన్ రాజ్ మంగళవారం పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాలను ప్రతి ఏటా 8,9,10తరగతి విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి నిర్వహిస్తున్నారని తెలిపారు. సైన్స్ సంబరాలు నాలుగు దశల్లో నిర్వహిస్తారన్నారు. ముందుగా పాఠశాల స్థాయి అక్టోబర్ 18న, మండల స్థాయి నవంబర్ 1న, జిల్లాస్థాయి నవంబర్ 23న, రాష్ట్ర స్థాయి డిసెంబర్ 12,13,14 తేదీల్లో నిర్వహిస్తారని వివరించారు. సివి టియు వినయ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు. హరి, సభ్యులు పాల్గొన్నారు.

వేంపల్లె : విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా శక్తిని పెంపొందించేందుకు జెవివి ప్రోత్సాహం ఇస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి శివరామిరెడ్డి, బాల బయన్న పేర్కొన్నారు. జెవివి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి గోడ పత్రికలను మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో అవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగాంజనేయులు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, పీజీటీ ఆవుల వెంకట్ పాల్గొన్నారు.

సిపిఆర్ పట్ల అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులతో సిపిఆర్ చేయిస్తున్న వైద్యాధికారి శ్రీనాథరెడ్డి

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

సిపిఆర్ పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలని అర్బన్ వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. స్థానిక రాణివనం జడ్‌పి ఉన్నత పాఠశాలలో మంగళవారం సిపిఆర్ పట్ల అవగాహన కల్పించారు. విద్యార్థులతో సిపిఆర్ పట్ల నాటకం వేయించారు. ఆకస్మికంగా ఎవరైనా గుండెపోటుకు గురైనప్పుడు సకాలంలో సిపిఆర్ చేసి ప్రాణాలు రక్షించవచ్చు అని తెలిపారు. మెదడుకు రెండు నుంచి మూడు నిమిషాలు వరకు ప్రాణవాయువు అందకపోయినా కోలుకోలేని నష్టం వాటిల్లుతుందన్నారు. ఆ సమయంలో తక్షణమే సిపిఆర్ ద్వారా ప్రాణాన్ని కాపాడుకోవచ్చు అన్నారు. సిపిఆర్ చేయడం వలన గుండె, ఊపిరితిత్తులు పునరుద్ధీవనం చెంది ఆ వ్యక్తి బతికే అవకాశాలు ఉంటాయని తెలిపారు. చిన్ననాటి నుంచే వ్యాయా మం దినసరి చర్యగా అల వర్చుకోవాలని సూచించారు. మంచి ఆహారపు అల వాట్లపై శ్రద్ధ వహిం చాలన్నారు. హెల్త్ సూపర్వైజర్ ఓబులేసు, రవి శంకర్ రాజు, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలవాట్లను మార్చుకుంటేనే ఆరోగ్యం

వేంపల్లె : ఆహారపు అలవాట్లను మార్చుకొని ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉండాలని సిహెచ్ఓ దేవి పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సహకారంతో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సిపిఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరైన వ్యాయామం లేకపోతే ఆరోగ్య సమస్యలు ఎక్కువగా వస్తాయన్నారు. ప్రతి వంద మరణాల్లో 10 మంది గుండెపోటుతో మరణిస్తున్నారని తెలిపారు. గుండెపోటు వచ్చినపుడు వెంటనే సిపిఆర్ చేయడం వల్ల ప్రాణాలను రక్షించవచ్చు అన్నారు. సిపిఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సిపిఆర్ విధానాన్ని విద్యార్థులచే చేయించి చూపించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఎం.ఓబుల్‌రెడ్డి, డాక్టర్ సి.మల్లేశ్వరమ్మ, అధ్యా పకులు శ్రీకాంత్‌రెడ్డి, అంగన్వాడీ ఆయా వెంకటరమణమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యాటకుల ప్రాణాలతో చెలగాటం వద్దు

జమ్మలమడుగు : మైలవరం, గండికోట జలాశయంలో పర్యాటకుల ప్రాణాలతో చెలగాటం ఆడే విధంగా బోటింగ్ ఉందని, అనుమతులు లేకుండా నడుస్తున్న బోటింగ్ రద్దు చేయాలని, సంబధిత వారిపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. ఆయన ఎన్జీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జలాశయంలో ప్రభుత్వ అను మతులు లేకుండా బోటింగ్ నిర్వహణ జరుగుతున్నట్లు పలు పత్రికలలో వచ్చిందన్నారు. అధికారులు విచారించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



విద్యార్థినులనుద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ హిమబిందు

భ్రూణ హత్యలను నివారించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

భ్రూణ హత్యలు నివారించాలని, ఇప్పటికే ఆడపిల్లల సంఖ్య తగ్గిందని ఫలితంగా భవిష్యత్తులో జరిగే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టిబి రోడ్డు డాక్టర్ హిమబిందు పేర్కొన్నారు. స్థానిక ఎద్దుల వెంకటసుబ్బమ్మ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం ఆడపిల్లలను రక్షించండి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల ప్రాధాన్యత, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం గురించి వివరించారు. ఆడపిల్ల అని తెలిసి అబార్షన్ చేయించుకోకూడదన్నారు. సృష్టిలో మహిళ ప్రాధాన్యత చాలా గొప్పదన్నారు. ఆడపిల్లలకు విద్య, ఉద్యోగం, భద్రత, హక్కులు కల్పించారని వివరించారు. భ్రూణ హత్యలు ప్రోత్సహించిన వారికి చట్టపరమైన శిక్ష ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, శోభారాణి, కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్ ఎంవి సుబ్బారెడ్డి, ఇన్‌ఛార్జి హెడ్మాస్టర్ పుల్లమ్మ, ఎఎన్ఎం శిల్పలత, ఆశా వర్కర్ తులసి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కంటిచూపును కాపాడుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

కంటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విటమిన్ లోపం లేకుండా తరచూ పౌష్టికాహారం తీసుకోవాలని ఆప్తమాలజీ ఆఫీసర్ గజ్జల చంద్రమౌళి సూచించారు. మండలంలోని అయ్యవారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలావరకు కంటి సమస్యలు పౌష్టికాహారం లోపంతో విటమిన్లు సరిగా అందక వస్తాయన్నారు. ఆకుకూరలు, కూరగాయలు బాగా తీసుకోవాలన్నారు. 120 మంది విద్యార్థులను పరీక్షించారు. వీరిలో ఇద్దరికి విటమిన్ ఎ, 5 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ సంఘం వారి ద్వారా ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎం.రాఘవయ్య, సూపర్‌వైజర్ టి.ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు గోపీనాథ్, ఫిజికల్ డైరెక్టర్ వివి శివారెడ్డి, ఉపాధ్యాయులు, ఎఎన్ఎం సింధు, ఆశా కార్యకర్తలు కుమారి, పార్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి నేతలకు ఘన సన్మానం

ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు రెండవసారి ఎన్నికైన మండల కన్వీనర్ సింగారెడ్డి రామమునిరెడ్డిని, పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్‌ను మంగళవారం ఇడుపులపాయ జనసేన నేత పోతిరెడ్డి చలపతి ఘనంగా సత్కరించారు. కష్టకాలంలో ఉన్న టిడిపి కోసం పనిచేసిన రామమునిరెడ్డిని టిడిపి అధిష్టానం గుర్తించి రెండవసారి ఏకగ్రీవంగా మండల కన్వీనర్‌గా ఎంపిక చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. మండల కన్వీనర్‌గా రామమునిరెడ్డి, పట్టణ అధ్యక్షుడిగా వేమకుమార్ నాయకత్వంలో వేంపల్లె మండలంలో పార్టీ మరింత బలపడుతుందనే విశ్వాసం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని చలపతి కోరారు. పార్టీ అధిష్టానం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి సాయిశక్తులా కృషి చేస్తామని రామమునిరెడ్డి, వేమకుమార్ తెలిపారు. మండలంలో టిడిపి పార్టీకి మెజార్టీ రావడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా స్వమిత్వ సర్వే

ప్రజాశక్తి - చాపాడు

గ్రామ కంఠాల్లోని ఇళ్ల, ఖాళీ స్థలాలపై ప్రజలకు యాజమాన్య హక్కులు కల్పించే స్వమిత్వ పథకం సర్వేను పంచాయతీ సిబ్బంది ముమ్మరం చేశారు. స్థలాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో సర్వే పూర్తిచేసి, యాజమాన్య హక్కు పత్రాలు అందజేయాలని సర్కార్ భావిస్తోంది. గత ప్రభుత్వంలో ఈ పథకం ప్రారంభమైనప్పటికీ నిధుల కేటాయింపు లేకపోవడంతో మందకొడిగా సాగుతూ వచ్చింది. సార్వత్రిక ఎన్నికలకు సంవత్సరం ముందే ఈ పథకం పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన గ్రామాల్లో సర్వే పూర్తిచేసి వచ్చే మూడేళ్లలో ఇళ్లు, స్థలాలు, ఇతర ఆస్తులపై ప్రజలకు హక్కులు కల్పించేలా కార్యాచరణ రూపొందించింది. గ్రామ కంఠాల్లో ఇళ్లు, స్థలాలను ఇతరులకు విక్రయించి రిజిస్ట్రేషన్ చేసే హక్కు ఇప్పటికీ లేదు. స్వమిత్వ పథకంలో ఇచ్చే యాజమాన్య హక్కు పత్రాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. దీనికోసం సర్కార్ చట్ట సవరణ చేయనుంది. సర్వేతో పంచాయతీలకు సంబంధించిన ఆస్తుల విషయంలోనూ స్పష్టత రానుంది. గ్రామాల్లో భవనాలు, కాలువలు, రోడ్లు, చెరువులు, ఖాళీ స్థలాలను సర్వేలో గుర్తించి హక్కులు నిర్ధారిస్తున్నారు. మండల పరిధిలో అన్ని గ్రామాలలో సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారని డిప్యూటీ ఎంపీడీఓ హరినాథ్ తెలిపారు. మంగళవారం చాపాడులో పంచాయతీ సెక్రటరీ సురేష్ బాబు, సుబ్బరాయుడు, సర్వేయర్ తులశీశ్వర్‌రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అంజలీ ఇళ్లకు సంబంధించి కొలతలు తీసుకున్నారు.